# నిప్పులాంటి నిజం

బుక్కారెడ్డి




పాలవాడి కేకలతో మెలుకువ వచ్చింది. గడియారం వేపు చూశాను. ఏడున్నర అవుతోంది. బద్ధకంగా ఆవలించి "వస్తున్నా.." అని జవాబిచ్చి వంటింట్లోకి వెళ్ళాను. గ్లాసు తీసుకుని వచ్చి తలుపులు తెరిచాను. పాలవాడు నవ్వు మొహంతో నమస్కారం చెప్పి "అమ్మగారెప్పుడు వస్తారు సార్?" అని అడిగాడు. "ఇవాళో రేపో వస్తార్లే!" అని చెప్పి పాలు గ్లాసులోపోయించుకుని తలుపులు మూశాను.

టేబిల్ మీద రేడియో ప్రక్కనున్న పాప ఫోటో నన్ను పలకరించింది. "గుడ్‌మార్నింగ్ డార్లింగ్!" అన్నాను. నువ్వెప్పుడు వస్తావు, ఈ కష్టాలెప్పుడు తప్పుతాయో అనుకున్నాను. వంటింట్లోకి వెళ్ళి హీటర్‌మీద కాఫీనీళ్ళు పడేశాను. బ్రష్‌మీద పేస్టు వేసుకుని బాత్‌రూంలోకి వెళ్ళాను. మొహం కడుక్కుని ఇవతలికి వచ్చేసరికి నీళ్ళు మరుగుతున్నాయి. కాఫీ పౌడరు వేసి పాలు అందులో గుమ్మరించాను. నెల రోజులుగా రోజూ చేస్తున్నా ఒక్కనాడైనా సరిగా కుదరటం లేదు. పాప చేసియిస్తే దాని రుచే వేరు. పైగా ఈ చెత్తా వేదాదం చూస్తుంటే అదైనా గొంతులోంచి దిగటంలేదు. సామానంతా చిందరవందరగా పడేశాను. పాపవచ్చిన తరువాత సర్దుకుంటుందిలే అనే ధీమాతో. కాని ఇవాళ రేపు అని పదిహేను రోజులుగా ఎదురు చూస్తున్నా పాప జాడలేదు.

నెల రోజుల క్రితం హైదరాబాద్ బదిలీ అయింది నాకు. ఇక్కడ ఇళ్ళు దొరకటం చాలా కష్టమని విని పాపని వాళ్ళ పుట్టింటికి అంటే బెజవాడకి పంపేశాను. తీరిగ్గా గృహాన్వేషణ సాగిద్దామని హొటల్‌లో గది తీసుకున్నాను. మర్నాడే సత్యం కనిపించాడు. సత్యం నాతోనే చదివాడు. అతని సహాయం వల్ల ఇల్లు సునాయాసంగా దొరికింది. అద్దె కొంచెం ఎక్కువే అనుకోండి! అయినా ఇల్లు బాగుంది. ఇల్లు దొరకగానే పాపను వెంటనే వచ్చెయ్యమని ఎక్స్‌ప్రెస్ ఇన్సూ ఉత్తరం రాశాను. దానికి, వాళ్ళనాన్నకు జబ్బుగావుందని నెమ్మదించగానే వస్తానని రాసింది. ఆయనంటే పాపకు చాలా అభిమానం. తండ్రిపైన అభిమానంగా వుండని దెవ్వరనవచ్చు మీరు. నా ఉద్దేశ్యం ఏమిటంటే తల్లిదండ్రులకు కన్నందుకు కాదు గౌరవంఇచ్చేది, వాళ్ళు పెంచిన తీరునుబట్టి. వాళ్ళిచ్చే శిక్షణవల్లే పిల్లలు బుద్ధిమంతులయ్యేది చెడ్డవాళ్ళయ్యేదీను. ఆయనకు కూతుళ్ళమీదా, భార్యమీదా ఏమాత్రం ప్రేమలేదు. వాళ్ళెవరో తనెవరో అన్నట్టుంటాడు. రెండేళ్ళ క్రితం ఇష్టంలేని పెళ్ళి చేస్తున్నారని పెద్ద కూతురు ఇంట్లోంచి వెళ్ళిపోతే ఆయన వెదకడానికి ఏ ప్రయత్నమూ చేయలేదు. "పోతే పోనీ" అనుకుని ఫూరుకున్నాడు. ఆ విషయం తెలిస్తే పాపను నేను చేసుకోనేమో అని నాదగ్గర దాచి వుంచారు. పెళ్ళయిన తరువాత పాప చెబితేనే తెలిసింది నాకీవిషయం. ఆయన ఎంత కఠినుడో చెప్పటానికి ఉదాహరణ మాత్రం ఇది. ఎంత ఆత్మబంధువైనా సరే, చివరికి ఇంటల్లుడైనా నాతో నేనాసరే ఆయన ఒకటి రెండు మాటలకంటే ఎక్కువ మాట్లాడడు. పాప కారణంగా [illegible] [illegible] కాని ఆయనంటే చా[illegible] [illegible] నాకు, [illegible] [illegible] [illegible]

ఆలోచనల్లో మునిగిపోయి, కాఫీ విషయమే మరిచి పోయాను. చూసేసరికి అంతా ఇగిరిపోయి ఉంది. దాన్నేదింపేసి కషాయంలా మింగాను. హీటర్ ప్లగ్ తీసివేసి బెడ్‌రూంలోకి వచ్చి కూర్చున్నాను.

స్నానం చేయాలంటే బద్ధకంగా వుంది. స్నానం చేస్తే భోజనానికి వెళ్లవలసి వస్తుంది. హోటల్ యజమాని బొజ్జ నిమురుకుంటూ చిరునవ్వుతో ఆహ్వానిస్తాడు. ఇక ఆ నాలుగు మెతుకులూ గొంతుకు దిగేసరికి నానాయాతనా పడిపోయి కళ్లవెంట నీళ్లు వస్తాయి. పైగా బయటి కొచ్చేస్తుండగా "ఎలా వుందిసార్ భోజనం? ఇవాళంతా స్పెషల్!" అంటాడు అయ్యర్. భోజనం మాట వదిలిపెట్టి ఈ మాటలు వింటే కోపం వస్తుంది. ఎలాగో అణుచుకుని "బాగానేవుంది!" అంటాను మొహమాటానికి. అతని మొహం వికసిస్తుంది. "నీ బాధల్ని లోపలే పెట్టుకుని అందరికీ చిరునవ్వు లందియ్యి" అని ఎవరో చెప్పారుగా. వాళ్లమాటల్ని పాటించానన్న తృప్తి నాకూ కలుగుతుంది. పాప వచ్చేస్తే ఈ అయ్యర్‌తో భోజనం లక్షణాలన్నీ వర్ణించి చెప్పి, నీ హోటల్లో భోజనం చాలా అసహ్యంగా ఉంటుందని మొహం మీద గుద్ది మరీ చెప్పి ఈ దిక్కుమాలిన హోటల్‌కు "గుడ్‌బై!" చెప్పెయ్యాలని చాలా కుతూహలంగా వుంది.

సిగరెట్ ముట్టించి రేడియో ట్యూన్‌చేశాను. సిలోన్ నుంచి రఫీ హాయిగా పాడుతున్నాడు. కళ్లు మూసుకుని మధుర స్మృతుల్లో తేలిపోయాను. సిగరెట్ కాలి వేళ్లు చుర్రుమనగానే తెలివివచ్చింది. కోపంతో విసిరికొట్టాను. మూలగావున్న కుప్ప లోని సిగరెట్ పీకలతో కలుసుకుంది అది. పాప వెడుతూ వెడుతూ సిగరెట్ మానెయ్యాలని షరతు పెట్టి వెళ్లింది. అసలు పెళ్లయిన మర్నాటినించే సిగరెట్ మానెయ్యమని గొణుగుతోంది. నేను వాయిదాలు వేస్తూ వచ్చాను. ఈసారి తప్పకుండా మానేస్తానవగానే "మానేయటం మాట అటుంచి నేను లేనని రెట్టింపు కాల్చకుంటే అదే పదివేలు" అన్నది.

గడియారం తొమ్మిది గంటలు కొట్టింది. ఇక స్నానం చేసి ఆఫీసుకి వెళ్లాలి. మళ్లీ ఆదివారాలు ఆఫీసులుండవని జ్ఞాపకం వచ్చింది. అయితే భోజనం చేసి పోస్టాఫీసుకి వెళ్లి పాపకి టెలిగ్రాం ఇవ్వాలి రేపు వచ్చెయ్యమని. లేచి టవల్ భుజం మీద వేసుకుని బాత్‌రూం వేపు నడిచాను.

తలుపు దబదబా బాదిన శబ్దం అయింది. "ఎవరు?" అన్నాను. సమాధానం లేదు. మళ్లీ శబ్దం. ఈమారు గట్టిగా అరిచాను. 'ఎవర'ని. "తలుపు తియ్యండి" అంటున్నారు. ఆడగొంతుక. "శ్రీమతి వచ్చెయ్యలేదుకదా!" అనుకుని తలుపులు తెరిచాను. పాపకాదు. ఎవరో ఆడమనిషి. తలుపులు తెరవగానే నన్ను తోసుకుంటూ లోపలికి వచ్చి తలుపులు మూసి గడియపెట్టింది. నాకు షాక్ తగిలినట్టయింది. ఆమె ధైర్యానికి, చొరవకు, ఆశ్చర్యపోయాను.

"ఎవరు మీరు? తలుపు లెందుకు మూశారు? గట్టిగా అడిగాను. ఆమె పెదవుల మీద వేలు పెట్టుకుని—"ష్" అని మాట్లాడ వద్దన్నట్టు సైగ చేసింది. నాకేమీ అర్థం కాలేదు. పిచ్చిగా ఆమె వేపు చూస్తూ ఉండిపోయ్యాను. మాసిపోయిన చీర, జాకెట్టు వేసుకున్నది. అంత ఖరీదైనవేంకాదు. పాలిపోయిన బుగ్గలు, నుదుట బొట్టులేదు. చెవులకు రింగులు వున్నాయి. షుమారు ఇరవై, ఇరవై రెండేళ్లు వుండవచ్చు. చెప్పుకోదగ్గ అందగత్తె కాదు గానీ అందకత్తెల్లోనే జమ. చూస్తేనే చప్పని బజారు రకం మనిషేమో అని అనుమానం కలుగుతుంది. ఎవరయితేనేంగాని, నామీద ఈ అకస్మాత్ దాడి ఏమిటి? ఆమె మౌనంగా నుంచుంది. నేను తనను దీక్షగా చూడటం గమనించి ఇబ్బందిగా కదిలింది.

"ఏమిటి విషయం?" అడిగాను. ఇదేదో సహాయం కావాలని, డబ్బుకోసం అడిగే రకమని అనుకున్నాను. ఈ నెల రోజుల్లో హైదరాబాద్ పట్టణంలో చాలా మందిని చూశాను అలాంటి వాళ్లను. వీళ్లు ఎంతో అందంగా యాచిస్తారు. పరీక్ష ఫీజు కట్టాలనో, పర్సు ఎవరో కొట్టేశారు, ఇంటికి వెళ్లటానికి చార్జీస్ లేవనో, లక్ష కారణా లుంటాయి వీళ్లకు. ఇంకోరకం వాళ్లున్నారు. వీళ్లది బిజినెస్ మైండ్. ఎనిమిదణాల పెన్నును ఆరు రూపాయల పెన్ అని చెప్పి అంటకట్టటానికి చూస్తారు. ఎక్కణ్ణించి సంపాదిస్తారో ఏమోగాని, టెరిలిన్ గుడ్డలు, ఎలక్ట్రిక్ ఐరన్‌లు, వాచ్‌చెయిన్‌లు చౌకరకంవి పట్టుకుని అమ్మటానికి తయారవుతారు. వాటివేపు ఒకసారి పరీక్షగా చూశామంటే చాలు వీడు బుట్టలోపడేరకమని తెలుసుకుని కొనంది వదిలిపెట్టరు.

నా మాటలకు ఆమె ఏమీ సమాధాన మివ్వలేదు. మౌనంగా ఇంటికప్పువేపు చూస్తూ ఉండి పోయింది. విసుగ్గా తలుపులు తెరవబోయాను. ఆమె నా చెయ్యి పట్టుకుంది. దీనంగా నా కళ్లల్లోకి చూస్తూ "తెరవకండి ప్లీజ్! వాళ్లు వస్తున్నారు" అన్నది.

కూర్చున్నాను. ఎదురుగావున్న కుర్చీలో కూర్చోమని సైగ చేశాను. ఆమె కూర్చోలేదు. వూరికే కంగారు పడుతోంది. పెదవులు వణుకుతుండగా నావేపు చూస్తోంది. చివరికి ధైర్యం చేసినట్టుంది. "ఎవరూ లేరా ఇంట్లో, ఆడవాళ్లు?" అంది.

"లేరు! అయినా నా దగ్గర డబ్బేం లేదు!" అన్నాను తొందర తొందరగా.

నావంక విచిత్రంగా చూస్తూ "డబ్బేమిటి?" అందామె. నా తొందరపాటుకు సిగ్గుపడ్డాను.

"అయితే మీరు దేనికోసం వచ్చినట్టు?" అడిగాను.

"వాళ్లు వస్తున్నారు!" అందామె మెల్లిగా.

"ఎవరు వాళ్లు? ఎందుకు వస్తున్నారు? నాకు పొడుపు కథలు వెయ్యటానికి విప్పటానికి టైము లేదు. త్వరగా చెప్పండి." అన్నాను.

ఆమె నా మాటకు సమాధానం ఇవ్వలేదు. నా ఉనికిని గమనించనట్టే టేబుల్ వద్దకు వెళ్లింది. పాప ఫోటో తీసి పరీక్షగా చూస్తూ "ఈమె ఎవరు?" అని అడిగింది. చిరాకు కలిగింది. నా ఇంటికి వచ్చి ఎందుకు వచ్చిందో చెప్పకుండా ఎదురు ప్రశ్నలు వేస్తున్నది పైగా.

"పాప." అన్నాను క్లుప్తంగా.

"అంటే?" ఆమె నావేపు విచిత్రంగా చూసింది. మళ్లీ అదే చూపు. దీనంగా, ఆశ్చర్యంగా, అందులో లేని భావాలు లేవేమో! నా కళ్లల్లోకి సూటిగా చూస్తోంది. నాకు ఏదో తెలీని భావం కలిగింది. నా మనసులోని ఏ భాగమో దోచుకుపోయినట్లవుతోంది. తల దించుకున్నాను.

"అంటే.... అంటే..... నా భార్య" సిగ్గుపడ్డాను. ఇది ఆమె ఎదుట రెండోసారి సిగ్గుపడటం. ఏదో తడబాటు కలిగింది. దాన్ని కప్పి పుచ్చుకోటానికి గాంభీర్యం నటిస్తూ "సరేగాని సంగతి ఏమిటో త్వరగా చెప్పండి. నేను స్నానంచెయ్యాలి. తరువాత భోజనం చెయ్యాలి. పైగా నాకు అవతల బోలెడు పనులున్నయ్" అన్నాను.

"నేనూ స్నానం చేయలేదు. భోజనం చేయలేదు." అన్నదామె నావంక చూస్తూ.

ఇక మొదలవుతుంది కథ అనుకున్నాను.

"మీ సొదంతా వినటానికి నాకు వోపికలేదు. ఈ అర్ధరూపాయి తీసుకుని దయ చెయ్యండి. ప్రస్తుతం నాదగ్గరింతకంటే ఎక్కువ లేదు. ఉన్నా ఇవ్వను" ఖచ్చితంగా చెప్పాను.

"నాకెందుకు?" ఆమె ప్రశ్నార్థకంగా చూసింది నావేపు.

"అయితే మీరెందుకొచ్చినట్టు? నాతో బాతాఖానీ వెయ్యటానికా? రెండు మూడు రోజులాగి రండి. అప్పుడు పాపవుంటుంది. ఆఫీసుకి వెళ్లి పోతాను నేను. మీరిద్దరు తీరిగ్గా కూర్చుని మాట్లాడుకోవచ్చు." చిరాగ్గా అన్నాను.

"వాళ్లు వస్తున్నారు!" అదేవిధంగా చూస్తూ మెల్లిగా అంది ఆమె. తల పట్టుకున్నాను. వోపిక నశించిపోతోంది. మెడబట్టి అవతలకి గెంటుదామా అంటే అదని. ఇంతకీ ఎవరు వాళ్లు? మాటి మాటికీ వస్తున్నారంటున్నది.

కిటికీ తెరిచి వీధివేపు చూశాను. జనం మామూలుగా తిరుగుతోన్నారు. ఎదురింటమ్మాయి గడప మీద కూర్చునివుంది. నేను ఆవేపు చూడగానే వెకిలిగా నవ్వింది.

నాగుండె గుభేలుమంది. ఈ ఇంట్లోకి వచ్చి నప్పటినించి ఈమె నామీద ప్రయోగాలు చేస్తున్నది. నేను ఎప్పుడూ రెస్పాన్స్ ఇవ్వలేదు. కొంప దీసి ఈ అమ్మాయి వచ్చింది చూడలేదుగద. ఆమె ప్రొద్దుటినుంచి సాయంత్రందాకా గడపలో కూర్చుని వచ్చేపోయే వాళ్ల మొహాలు పరీక్షగా చూస్తుంది కనక చూడకుండా ఉండటం అసంభవం. రేపు పాప వచ్చిన తరువాత, మెల్లిగా ఆమెతో స్నేహం కలిపి "ఇట్లా మీ ఆయనతో వో స్త్రీ ఉండగా చూశా"నంటే కొంప మునుగుతుంది.

నాకు విపరీతమయిన కోపం వచ్చింది. కుర్చీలో కూర్చున్నాను. కిటికీ రెక్క వేసి. ఆమెను కూర్చోమని సైగ చేశాను. ఎదురుగా ఉన్న కుర్చీలో కూర్చుంది.

"ఇదిగో మీపేరేమిట్టన్నారు?" కోపం అణుచుకొని సాధ్యమైనంత అనునయంగా మాట్లాడుతూ.

"లలిత" అన్న దామె.

"మీరేమైనా చదువుకున్నారా?"

"బియ్యే పాసయ్యాను!"

ఉలిక్కిపడ్డాను. నా వూహాలన్నీ తలక్రిందులు అయినయ్. ఈమె బి. ఎ. చదవటమేమిటి? చాలా ఆశ్చర్యం కలిగింది. ఆమె నిజం చెప్పటం లేదేమో అనిపించింది.

"మీరు నిజం చెబుతున్నారా?" కుతూహలంగా అడిగాను.

"అబద్ధ మాడాల్సిన అవసరమేమొచ్చింది?" ఆశ్చర్యంగా కళ్లు పెద్దవి చేసి చూస్తూ అన్నదామె.

"మీరు నా ఇంట్లోకి వార్నింగ్ అయినా ఇవ్వకుండా దయచెయ్యటానికి కారణం ఏమిటి?" అడిగాను. ఇప్పుడైనా చెబుతుందేమోననే నమ్మకంతో.

"ఆకలిగా వుంది!"

ఏజన్మలోనో పాపం చేసి ఉంటాను. అందుకే ఈ రోజు ఇంత తలనొప్పి వచ్చిపడింది. కాలికివేస్తే మెడకు, మెడకువేస్తే కాలికి వేస్తున్నది. సామాన్యురాలిలా లేదు. ఇది ఇప్పట్లో వదిలే పీడకాదు.

"అయితే ఏం చెయ్యమంటారు ?" కోపంగా అడిగాను.

"వంటిల్లెక్కడుంది?" లేచి లోపలకు వెళ్లటానికి ప్రయత్నిస్తోంది.

"లోపల వండేందు కేవరూలేరు. నేను హోటల్ లో భోంచేస్తాను" అన్నాను కటువుగా. ఎట్లాగైనా ఈమెను బయటికి వెళ్లేట్టు చెయ్యమని కోరుకుంటాను ప్రస్తుతం భగవంతుడు ప్రత్యక్షమయితే. కాని లాభంలేదు.

"మరెట్లా?" నావంక దీనంగా చూస్తూ అన్నది. ఆ చూపు నన్ను కదిలించి వేసింది. గుండెల్ని పిండివేసింది. ఆ చూపుకి కరిగిపోయ్యాను. జాలి వేసింది, నన్ను నేనే తిట్టుకొన్నాను. ఈ దీనురాలి పట్ల ఇంత కఠినత్వం చూపిస్తున్నందుకు సిగ్గువేసింది.

"సరే. కూర్చోండి. భోజనం తెప్పిస్తాను. ఈ స్థితిలో మీరేమీ చెప్పేట్టులేరు. తరువాత మాట్లాడుకుందాం!" అన్నాను.

ఆమె నమ్మలేనట్టుగా కళ్లు పెద్దవి చేసి చూసింది. ఎగతాళికి అంటున్నాననుకుందేమో. లేచి తలుపువేపు నడిచింది. "ఎక్కడికి?" అడిగాను.

"నేను వెడతాను!" తల దించుకుని అన్నదామె.

ఇప్పటిదాకా ఆమెనెట్లా వదుల్చుకోవాలా అనిపించిన నాకు ఇప్పుడు ఆమె వెడతానంటుంటే

# నిప్పులాంటి నిజం

బాధగావుంది. ఇదివరదాకా ఆకలితోవున్న ఆమెను విసిగించాను. మర్యాద చేయటం విడిచి మాటలతో బాధించాను. బంధువులెవరేనావస్తే ఇట్లాగే చేస్తామా మర్యాద. ఈమె తెలియని బంధువే అనుకుంటాను.

"భోజనం చేశాక వెళుదురుగాని. అదో బాత్ రూము అక్కడవుంది. మీరు స్నానం గట్రా చేస్తారేమో చెయ్యండి. ఆ బీరువాలో నా చీరలు జాకెట్లు వున్నాయి. తీసుకోండి. మీరు స్నానం చేసేలోగా నేను వెళ్ళి భోజనం పట్టించుకుని వస్తాను." అన్నాను.

ఆమె వెనక్కి తిరగలేదు. అటువేపే చూస్తూ ఉండిపోయింది.

"ఎక్కడికి వెళతానంటున్నారు?" మళ్లీ అడిగాను.

"శేఖర్ దగ్గరికి!" తలుపు తీస్తూ అన్నదామె.

లేచి వెళ్లాను. ఆమె చేయి పట్టుకుని తీసుకువెళ్లి కుర్చీలో కూర్చోబెట్టాను. తలుపులు తెరిచి వున్నాయేమో ఎదురింటమ్మాయి కిసుక్కున నవ్వింది. కోపంతో దభాలున తలుపులు మూసేశాను.

"మీకు ఆకలి వేస్తుందన్నారుకదూ, భోజనం చేసిన తర్వాత వెళ్లండి. తొందర్లో అలా ప్రవర్తించాను. దయచేసి ఏమీ అనుకోవద్దు. క్షమించండి" అన్నాను. ఇట్లాంటి మాటలు మాట్లాడటం నాకు అలవాటులేదు. గోడవేపు చూస్తూ గడగడా ఒప్పగించాను.

ఆమె మాట్లాడలేదు. నావేపు మౌనంగా చూస్తూ ఉండిపోయింది.

"లేవండి. లేచి స్నానం చెయ్యండి. శేఖర్ని పిలిపించమంటారా? ఎక్కడున్నాడతను? ఫోను ఉందా?" వరసాగ్గా ప్రశ్నలు వేశాను.

నాకంత శోషకు ఫలితం "తెలియదు"

"సరే మీరు బాత్‌రూంలోకి వెళ్లిపోండి. నేను మళ్లీ వస్తాను" అంటూ తలుపులు తెరచుకుని ఇవతలికి వచ్చాను. తలుపులు దగ్గర వేస్తుండగా ఎవరో దగ్గినట్టు శబ్దం అయితే వెనక్కి తిరిగి చూశాను.

ఎదురింటి అమ్మాయి. వెకిలిగా నవ్వుతూ ఎవరన్నట్టు సైగచేస్తోంది. కోపం వచ్చింది. వెక్కిరింతగా నవ్వుతూ "ఎవరైతే నీకేం" అన్నట్టు చూసి ముందుకి నడిచాను.

మైలు దూరంలో వున్న హోటల్‌కి టాక్సీ మీద వెళ్లి ఇద్దరికి కారియర్ సర్దమన్నాను అయ్యర్‌తో.

"ఇద్దరెవరు సామీ మీ మిస్సెస్సు వచ్చిందా?" అని అడుగుతూన్న అయ్యర్‌కు రాలేదని చెప్పి ఇంకా ఏం అడుగుతున్నాడో వినిపించుకోక టాక్సీలో కూలబడ్డాను. హోటల్ కుర్రాడు ముందర డ్రైవర్ ప్రక్కన కారియర్‌తో కూర్చున్నాడు.

పది నిమిషాల్లో టాక్సీ ఇంటి ముందర ఆగింది. కుర్రాడు కారియర్ లోపలపెట్టి వెళ్లిపొయ్యాడు. టాక్సీ చార్జి చెల్లించి లోపలకు నడిచాను. ఆమె అదే కుర్చీలో అట్లాగే కూర్చుని వుంది. నేను వెళ్లినప్పటినించి కదిలిన సూచనలేం కనిపించలేదు.

"స్నానం చెయ్యలేదా?" అడిగాను.

"చేస్తాను"

"మరి లేవండి మీరు చేసిన తర్వాత నేనూ చేస్తాను. ఆకలివేస్తోంది నాకు" అన్నాను.

మెల్లిగా లేచి బాత్‌రూంవేపు నడిచింది ఆమె.

అరగంట తర్వాత ఇద్దరము డైనింగ్ టేబుల్ ముందర కూర్చుని వున్నాము. డిషెస్‌లోవి నేను వడ్డిస్తుంటే ఆమె తింటున్నది. ఇట్లాంటి తిండికి మొహం వాచినట్టు ఆమె తినేతీరు తెలియచెప్తుతోంది. ఆమెవంక పరీక్షగా చూస్తే సిగ్గుపడుతుందేమోనని నా మానాన నేను తింటున్నాను. ఈ సమావేశం నాకు ఆశ్చర్యాన్ని కలుగ జేస్తున్నది. గంట రెండు గంటల క్రితం ముక్కూ మొహం తెలియని ఆమెతో నేను కలిసి భోజనం చెయ్యటమేమిటి? ఇంతకూ ఎవరు ఆమె? బి. ఏ. పరీక్ష ప్యాసైందిట. ఎవరో శేఖర్‌ట. అతనెక్కడుంటాడో తెలీదుట. మళ్లీ అతని దగ్గరకు వెడతానంటోంది. ఈ వూరికి క్రొత్తా? ఇదంతా గందరగోళంగా వుంది నాకు. ఆమెతో ఎట్లా ప్రవర్తించాలో అర్థం కావటం లేదు. భోజనం చేసిన తర్వాత ఆమె వెళ్ళిపోతుందా? పోతే ఎక్కడికి? ఇట్లాంటి ఆలోచనలతో తినటం ముగించాను.


టవల్‌తో చేతులు తుడుచుకుంటూ ఇవతలికి వచ్చాను. నా వెనకాలే ఆమె వచ్చింది. కూర్చోమని చెప్పి వక్కపలుకు లందించాను. ఆమె కూర్చుని వక్క పలుకులు నములుతూ నావేపే దీక్షగా చూస్తోంది. నా ఈ చర్యలన్నీ ఆమెకు ఆశ్చర్యంగా వున్నాయి కాబోలు.

సావధానంగా కుర్చీలో కూర్చుని సిగరెట్ వెలిగించాను. కొంతసేపు నిశ్శబ్దం రాజ్యం చేసింది గదిలో, చివరికి కుతూహలం పట్టలేక అడిగాను.

"లలితాదేవీ! మీదీవూరు కాదా?"

దిగులుగా చూస్తూ "కాదు" అన్నది ఆమె.

"మీరేమీ అనుకోనంటే, మీరిక్కడికి



ఎందుకు వచ్చారో అసలు మీదేవూరో? శేఖర్ ఎవరో చెప్పండి! పైగా ఎవరో వస్తున్నారంటిరి కదా! ఎవరువాళ్ళు?" అడిగాను.

ఆమె కొన్ని క్షణాలసేపు మౌనంగా కూర్చుని వుంది తలదించుకుని వేళ్లవేపు చూసుకుంటూ. తరువాత "అదంతా మీకు చెప్పి లాభమేమిటి? మిమ్మల్ని బాధపెట్టడం తప్ప! దారిన పోయేదాన్ని. కొంతసేపు మీ ఇంట్లో తలదాచుకోవలసివచ్చింది. కాని నా సమస్యలను మీపై రుద్దాలని కాదు!" అన్నది క్షీణ స్వరంతో.

"ఇందులో బాధపడేందు కేముంది లలితాదేవి గారూ! పరిచయంలేని మనం ఇలా అకస్మాత్తుగా కలుసుకోవాలని దైవ నిర్ణేశం అయివుంటుంది. నాతో చెబితే మీ మనసులోని బాధ కొంత అయినా తగ్గుతుంది. మీ బాధలు, కష్టాలు పరిష్కారం కావటానికి నా చాతనైనంతగా ప్రయత్నిస్తాను. ఇందులో బలవంతం ఏమీలేదు. సహజమైన కుతూహలం వల్ల అడిగాను. మీకు ఇష్టమయితేనే చెప్పండి!" అన్నాను. ఇన్ని మాటలు నేనే మాట్లాడానా అనిపించింది.

ఆమె నిట్టూర్చింది. దిగులుగా నా కళ్లలోకి చూస్తూ ఇందాకటిలానే "మీరు అంత కుతూహల పడుతోంటే చెప్పకుండా ఉండటం భావ్యంకాదు. నాది అంత పెద్ద కష్టమేమీ కాదు కూడాను. శేఖర్ అడ్రస్ తెలిస్తే చాలు వెళ్లిపోతాను. ఇవాళ స్టేషన్‌కి వస్తానని చెప్పాడు కాని రాలేదు. ఈ మహానగరంలో అతని అడ్రస్ తెలుసుకోటం నాతరం కాదు. ఆ సహాయం చేసిపెట్టండి. మీకు ఆ జన్మాంతం కృతజ్ఞురాలిని అయి వుంటాను" అన్నది.

"ఇంతకూ శేఖర్ ఎవరు? మీకే మౌతాడు ?" అడిగాను.

"శేఖర్ ఎవరంటే ఏమని చెప్పను ? తల్లి దండ్రుల్ని, అక్కచెల్లెళ్ళని పుట్టి పెరిగిన పరిసరాల్ని నా అని చెప్పబడే సమస్తమూ వదులుసకుని వచ్చాను అతనికోసం. ముఖ్యంగా నా భవిష్యత్ కోసం. అతని అడ్రసు కొన్నిగంటల క్రిందటదాకా నాదగ్గర వుంది. ఇంటికి తిరిగి వెళదామంటే, మా నాన్న విషయం నాకు బాగా తెలుసు. ఆ ఇంట్లో నాకు స్థానం లేదు. ప్రపంచం మొత్తంలో శేఖర్ తప్ప ఎవరూలేరు నాకు. అతనెక్కడుంటాడో నాకు సరిగా తెలీదుకాని ఇంజనీరింగ్ నాలుగవ సంవత్సరం చదువుతున్నాడని తెలుసు. నన్ను అతని దగ్గర చేర్చ గలిగితే మీమేలు మరిచిపోలేను" అన్నది లలితా దేవి.

మామూలు ప్రేమకథే. కాని కుతూహలం నన్నాగ నీయలేదు. "ఇల్లు వదిలి రావలసిన అవసర మేమొచ్చింది?" అడిగాను.

ఆమెఒక్కక్షణం నావంక చూసి నిట్టూర్పు విడిచింది.

"నేను చెప్పబోయేది వింటే మీరు నవ్వు తారు. ఏమీ తెలీనిదానికింద జమకడతారు. బహుశ అసహ్య పడతారేమో కూడా. అయినా ఇందులో దాచుకొందికి ఏమీ లేదు. మా నాన్నకు వో విధవ అక్కగా రున్నది. ఆవిడ కొడుక్కి నన్ను చెయ్యాలని మా నాన్నారి ప్రయత్నమూ, ఆవిడ ఇష్టమూ. ఇందులో నా ఇష్టాయిష్టాల ప్రసక్తి లేకపోయింది. నేను గ్రాడ్యుయేట్‌ను. చిన్నపిల్లను కాను. నా మంచి, చెడ్డలేవో నేను నిర్ణయించుకోగలను. అతను తల్లిచాటున పెరిగాడు. నాకంటే మూడు సంవత్సరాలు సీనియర్ అయివుండీ ఇప్పటికీ బి. ఏ. పరీక్ష ఇస్తున్నాడు. శుద్ధ బుద్ధావతారం. పెళ్ళంటే ఏమిటో కూడా అతనికి తెలీదనుకుంటాను. నాకన్నా అన్ని విధాల తక్కువయిన వాణ్ణి కట్టుకుని ఏం సుఖపడను? ఆడది తన భర్త తనకన్నా అన్నివిధాల ఉన్నతుడయి ఉండాలని కోరుతుంది. తల్లిదండ్రుల చాటువాడు కాక స్వతంత్రమయిన ఆలోచనలు కలిగి వుండాలనుకొంటుంది. రేపు "మల్లెపూ లొచ్చాయండీ!" అంటే "అమ్మా. కానీ ఇవ్వవే!" అనే మగాడ్ని ఏ ఆడదీ ఇష్టపడదు. ఆడదానికి మగాడి నుంచి కావలసింది ముఖ్యంగా రక్షణ....."

అర్థోక్తిలో అడిగాను. "మీ అమ్మగారు ఏమంటారు? ఏ తల్లీ కూతురు కష్టపడాలని అను కోదు కద! మీరిద్దరూ ఎదురు తిరిగితే పెళ్ళి ఆగిపొయ్యే అవకాశాలు లేకపొయ్యాయా?"

"అమ్మకు ఈపెళ్లి సుతరామూ ఇష్టంలేదు. నేను తన ఆడబడుచు చేతిలో నానాహింసలు పడతానని తెలుసు. కాని ఏమీ చెయ్యలేదు. మేమేం బాగా డబ్బున్నవాళ్లం కాదుగద. ఇదికాక పోతేమరోటి అనుకోవటానికి. ఈ సంబంధం కంటే మెరుగయింది మానాన్న తన జన్మలో తీసుకరాలేడు. శేఖర్‌కూ నాకూ మధ్య ఉత్తరాలు నడుస్తున్న య్యని కూడా ఆమెకు తెలుసు. కాని శేఖర్ తండ్రి అంటే మా ఎదురింటాయన కట్నం సంఖ్య చెప్ప గానే రాయటం మానెయ్యమని హెచ్చరించింది. కాని శేఖర్ మనస్సు నాకు తెలుసు. ఈ పరిస్థితుల గురించి వివరంగా అతనికి రాయగానే నన్ను ఇక్క డికి ఒచ్చెయ్యమని ఉత్తరం రాశాడు అడ్రస్ ఇస్తూ. స్టేషన్‌కి ఒస్తాననన్నాడు. రాత్రి ప్రయా ణంలో నాబాగ్ ఎవరో కొట్టేశారు. అందులో అడ్రస్ కాగితం ఉండిపోయింది. అనుకున్నట్టు శేఖర్ స్టేషనుకు రాలేదు. ఎట్లా ఏం చెయ్యాలా అని ఆలోచిస్తూ స్టేషను బయటికి రాగానే నలు గురైదుగురు రౌడీల్లావున్నారు. నావెంట పడ్డారు పిచ్చి పిచ్చి మాటలు మాట్లాడుతూ. ఆడదాన్ని, పైగా ఒంటరిని, కొత్త నగరం. అయోమయం పరిస్థితిలో వాళ్లనుంచి తప్పించు కుందుకు....."

ఎవరో తలుపులు కొడుతున్నారు బయట.

"ఎవరు?" అని కేకేశాను.

"టెలిగ్రాం సార్!" టెలిగ్రాఫ్ మెసెంజర్. ఆమె భయంతో ముడుచుకు పోయి కూర్చున్న దల్లా ఈమాట విని సర్దుకు కూర్చుంది.

గబగబా బయటికి వెళ్లి తలుపులు తెరిచాను. సంతకం చేసి టెలిగ్రాం తీసుకున్నాను. తలుపులు వేసి తిరిగి వస్తూ చించి చదివాను.

"ఎక్స్ ప్రెస్‌కు వస్తున్నాను. స్టేషన్‌కి రండి!"

——పాప..

టైము చూశాను. పదకొండవుతుంది. ఇంకో నలభయి అయిదు నిమిషాల్లో స్టేషన్‌లోవుండాలి నేను.

"ఏమిటి విషయం? " నావంక కుతూహలంగా చూస్తూ అడిగింది లలితాదేవి.

"నాభార్య వస్తున్నది. స్టేషనుకు వెళ్లాలి నేను" అన్నాను.

"ఓ. ఆమె వస్తున్నారా!" ఆశ్చర్యంగా అంది ఆమె.

ఆశ్చర్యం ఎందుకో నాకు అర్థం కాలేదు.

"ఇంట్లో ఒక్కరూ ఉండగల్గుతారా? మీకు అభ్యంతరం లేకుంటే రండి. ఇంట్లో ఉండాలను కొంటే 'ఉండండి." అన్నాను.

పాప ఫోటోను పరీక్షగా చూస్తోంది ఆమె. నేను అడిగినా దానికి సమాధానం ఇవ్వకుండా.

"మీరు వస్తారా ? తిరిగి వచ్చిన తరవాత శేఖర్‌ను — వెతికేందుకు ఆలోచిస్తాను" అన్నాను. మళ్ళీ.

ఆమె ముఖ కవళికలు మారిపొయ్యాయి. ఏదో ఆలోచిస్తున్నట్టు కనిపించింది. రెండునిమిషాల నిశ్శబ్దం తరువాత "ఆమెను చూడాలనే వుంది. కాని నేను రాలేను, క్షమించండి!" అంటూ మొహం తిప్పుకొన్నది.

ఇంకో ముప్ఫయ్యైదు నిమిషాల టైము ఉంది. నేను కారణాల కోసం వెతక లేక పోయాను.

"ఫరవాలేదు. ఇంట్లోనే వుండండి. గంటలోపల తిరిగి వస్తాను. అంతవరకు ఈ పత్రికలు చదువుతోండండి. ఇష్టం లేకపోతె రేడియో వినండి. అంటూ పత్రికలు ఆమె ముందర పడేశాను.

"తలుపులు వేసుకోండి" అంటూ బయటికి నడి చాను.

నాంపల్లి స్టేషన్ మా ఇంటికి నాలుగుమైళ్ళుం టుంది. బస్సు అయితే అరగంటలో చేరుకోలేను. అసలు దొరకటం కష్టం. మొదట కొంత వ్యాయామం నేర్చుకొని చిరిగిపోయిన బట్టలు వేసుకుని ఉండటం అవసరం బస్సులో ప్రయా ణంచేయాలని వుంటే, ఈ బస్సులకి బ్రేకులు పెట్టడం మరచి పోయారో లేక వాళ్ళకి ఆపాలని వుండదో గాని మొత్తం మీద బస్సు ఓవైపు నడుస్తూ వుండగానే ఎక్కటం దిగటం చేస్తారు. డ్రైవరుకి సిగరెట్ ముట్టించు కోవాలనిపించి నప్పుడు మాత్రం తప్పకుండా ఆపుతాడు.

టాక్సీ ముందునుంచి వెళ్లటం గమనించి పిలిచాను. ఆగగానే ఎక్కి కూర్చున్నాను. స్టేషన్‌కు వెళ్లమని చెప్పి సీటుకి చేరగిలబడి కళ్ళు మూసుకుని ఆలోచించ సాగాను.

ఆమె ఎవరు? ఆమె నిజమే చెబుతున్నదా? రెండుమూడు గంటల క్రితం తప్ప ఎన్నడూ చూడని ఆమెకు నేను ఇల్లు అప్పగించి రావటం ఏమిటి? ఇప్పటిదాకా చాలా మంచి పని చేశానని నన్ను నేను అభినందించు కొంటున్నాను. ఈ ఆలో చనలు రాగానే పాప మెదిలింది మనస్సులో. పాప రానుంది. ఇదంతా నిజమేనని నమ్ముతుందా?

ఆలోచనలు అడ్డదార్లు పడుతున్నాయి. టాక్సీ ఆగినట్టు తోచగా కళ్ళు తెరిచాను. నాంపల్లి స్టేషన్. దిగి మీటర్ చూసి డబ్బులిచ్చి టాక్సీ వాడిని పంపేశాను. ప్లాట్‌ఫారం టికెట్ ఒకటి కొనుక్కుని లోపలికి నడిచాను. ట్రెయిన్ కోసం ఎదురు చూస్తున్న వాళ్లతో స్టేషన్ సందడిగా వుంది. బుక్ స్టాల్‌వద్దకు నడచాను. రైలు రావ టానికి ఇంకో పదినిమిషాలుంది. పుస్తకాలు తిరగేస్తూ ఆలోచిస్తున్నాను. మెదడంతా గందర గోళంగా వుంది. పిచ్చి పిచ్చి ప్రశ్నలు

తోస్తున్నాయి. నా తెలివితక్కువతనానికి నిందించుకున్నాను. "ఆమెను ఒంటరిగా ఇంట్లో ఒదిలి రావటమేమిటి? హైదరాబాద్‌లో మోసగాళ్ళ సంఖ్య చాలా ఎక్కువని విన్నాను. ఒకవేళ ఆమె..."

ఈ ఆలోచన రాగానే అనుమానం వేసింది. ఆమె ఇంట్లోకి ఒచ్చినప్పటినించి ఆమె ప్రతి చర్యా అనుమానాస్పదంగానే వుంది. స్టేషన్‌కి రమ్మంటే రాననటానికి కూడా అదే కారణమయి ఉండాలి.

ఎక్కువగా ఆలోచించలేక పోయాను. రైలు వస్తోంది. బుక్‌స్టాల్‌నుంచి ఆవేపు నడిచాను. రాబోయే రైలులో పాప వస్తున్నది. ఆమె రావటంతోనే అన్ని సమస్యలు విడిపోతాయి. నాకు ధైర్యం ఇస్తుంది పాప. నెమ్మదిగా ఆగటానికి ప్రయత్నం చేస్తున్న రైలులోంచి ఆడవాళ్ల కంపార్టుమెంట్ తలుపు దగ్గర నిలబడి చెయ్యి వూపుతోంది పాపా రాణి. సంతోషంగా ఆమెవేపు పరుగెత్తుకెళ్లాను. రైలు పూర్తిగా ఆగగానే సూట్‌కేస్ నా చేతికి అందిస్తూ దిగింది అందరినీ తోసుకుంటూ.

ఇద్దరమూ రిక్షా వాళ్లను హోటల్ వాళ్లను తప్పించుకుంటూ బయటికి నడిచాము. ఇవతలికి రాగానే టాక్సీని కేకేశాను. ఇద్దరమూ కూర్చుని నా అడ్రస్ చెప్పగానే టాక్సీ కదిలింది. పాప అడుగుతోంది. "ఇల్లెక్కడ? అద్దె ఎంత? హోటల్ తిండి ఎట్లా వుంటోంది" వగైరా వగైరా. ఆలోచిస్తూనే సమాధానం చెబుతున్నాను.

ఎట్లా చెప్పాలి ఆమెను గురించి పాపకు? అపార్థం చేసుకోదుగదానన్ను? ఎవరో తెలియని ఆడదాన్ని ఇంట్లో వుంచి ఒచ్చానంటే నమ్ముతుందా? ఎవరైనా మాత్రం నమ్ముతారా? ఇంతకీ వెళ్లేదాన్ని వెళ్లనివ్వక సహాయం చేస్తానని వెనక్కి పిలిచిన నన్ననాలి!.

"ఏమండీ అట్లాఉన్నారేం?" పాప అడుగుతోంది.

"ఎట్లా ఉన్నాను?" తడబడ్డాను.

"నేను వచ్చిన సంతోషమేమీ కనిపించటం లేదు మీలో. ఇందాకటినించి అదోలా పరధ్యానంగా వుంటే అడిగాను." చిన్నబుచ్చుకుని అన్నది.

ఇక చెప్పక తప్పదు. ఇంటికి వెళ్లిన తరవాత ఎట్లాగూ తెలుస్తుంది. జరిగేదుంటే ఆనక మాత్రం గందరగోళం తప్పదు కద. ఇప్పుడే చెప్పటం మంచిది. కాని ఎట్లా మొదలెట్టాలో తెలీక తికమక పడ్డాను.

"ఏమీ లేదు. ఇవాళ మనింటికో ఆడ మనిషి వచ్చింది." అన్నాను.

"ఆడమనిషంటే........?" ప్రశ్నార్థకంగా నావేపు చూసింది పాప.

"నిజం. నన్ను నమ్ము. ఆమె ఎవరో నాకూ తెలీదు. ఇంటినించి పారిపోయి వచ్చాననీ సాయం చెయ్యమని అన్నది. నాతోనే భోజనం చేసింది. స్టేషన్‌కు వెళ్లి వొస్తానని ఇంట్లో వుండమని చెప్పివచ్చాను. ప్రస్తుతం ఆమె మనింట్లో వుంది" అన్నాను. నన్ను నేను మెచ్చుకున్నాను చెప్పగలిగినందుకు.

అనుకుంటూనే వున్నాను మొదలెడుతుందని.

"అయ్యో! ఎంత అమాయకులండీమీరు. అదె వస్తే నేను లేనని తెలిపి మిమ్మల్ని వల్లో

# నిప్పులాంటి నిజం

వేసుకోవాలని వచ్చి వుంటుంది. ఎట్లా నమ్మారండి మీరు? ఇంతకి మిమ్మల్నేం లాభం మీమగజాతి బుద్దే అంత. ఎర్రగా బుర్రగా ఆడది కనిపిస్తే చాలు అదిచెప్పినదల్లా నమ్ముతారు. ఇంతకీ డబ్బేమేనా ఉందా ఇంట్లో? నానగలు ఎక్కడ పెట్టారు?" జాలిగా నావేపు చూస్తూ అడిగింది పాప.

నాకు సిగ్గేసింది. ఆడదానిముందర అందులో భార్య ఎదుట అమాయకుడయి పోవటం కన్నా వేరే అవమానంలేదు మగవాడికి. ఇంతలో డబ్బు, నగల విషయం జ్ఞాపకం వచ్చింది.

"జాగర్తగానే బీరువాలో పెట్టాన్లే. కాని తాళంవేసినట్టు జ్ఞాపకం లేదు." అన్నాను. నా ధైర్యం దిగజారిపోయింది. ఈనెలజీతం అంతా కూడా అందులోనే వుంది మరి.

"ఇంకేం! నేననుకొన్నంతా అయింది........" ఇంకా ఏమో అంటూనే వున్నది ఆవిడ. ఇంతలో టాక్సీ ఇంటిముందర ఆగింది.

ఇంటితలుపులు బార్లా తెరిచి ఉన్నాయి. నా గుండె పూర్తిగా కొట్టుకోవటం మానేసింది. టాక్సీవాడికి డబ్బిచ్చి ఓచేత్తో సూట్‌కేస్ పట్టుకుని త్వర త్వరగా ఇంటివేపు నడిచాను. లోపల ఏదో సందడి అవుతున్నట్టుంది. ఇదేదో ముఠా లాగుంది. పోలీసులకి ఫోన్ చేస్తే మంచిదేమో అనుకుంటూ ఏమైతేఅదయిందని మొండిధైర్యంతో లోపల అడుగు పెట్టాను. శ్రీమతి వెనకాలే వస్తోంది. ఇంట్లోకి అగుడగుపెట్టగానే కనిపించిన దృశ్యం నన్ను ఆశ్చర్య చకితున్ని చేసింది. మా ఎదురింటమ్మాయి, యూనిఫాంలో ఇద్దరు పోలీసులు ఇంకా ఎవరో ముగ్గురు తెల్ల బట్టలవాళ్ళు లలితాదేవి చుట్టూ నించుని వున్నారు. ఆమెను




బలత్కారంగా పట్టుకొని పోవటానికి ప్రయత్నిస్తున్నారు.

"రెడ్ హాండెడ్‌గా పట్టుకున్నారన్నమాట దొంగను! మెనీమెనీ థాంక్స్!" ఎదురింటమ్మాయి వేపు చూస్తూ అభినందించాను.

"దొంగెవరండీ?" ఆమె విచిత్రంగా చూసింది నావేపు.

"ఏంజరిగిందిమరి?" అలవాటయిపోయిన నా తొందరపాటుకు సిగ్గుపడుతూ అన్నాను.

ఇంతసేపు తల దించుకునుంచున్న లలితా దేవి నాకంఠం వినగానే తలెత్తింది. నావేపు దీనంగా చూస్తూ డగ్గుత్తికతో "వాళ్లు వచ్చేశారు!" అన్నది.

నేను వినిపించుకోలేదు. తెల్లబట్టల్లోవున్న ఒకతను నాదగ్గరకువచ్చి "మీ అనుమతి లేకుండా మీ ఇంట్లోకి వచ్చినందుకు క్షమించండిసార్! కాని తప్పనిసరయింది. ఈమెను వెదుకుతూ వచ్చాము. ఈవిడగారు ఈఇంట్లో చొరబడిందని చెప్పారు. మీరు లోపల లేకపోయినందువల్ల ఈమెను పట్టుకోవటానికి గాను రావాల్సి వచ్చింది!" అన్నాడు సంజాయిషీ ఇస్తున్నట్లు.

"ఏం చేసింది ఈమె!" కుతూహలంగా అడిగాను.

"పిచ్చాస్పత్రి నుంచి పారిపోయి వచ్చిందండీ!" అన్నాడు అతను.

మాఆవిడ నిశ్శబ్దంగా చూస్తోంది. నాకు తల తిరిగినట్టయింది. ఎదురింటమ్మాయి"నేనేచెప్పానండీ ఆమనిషిని చూస్తేనే నాకనుమానం వేసింది. పిచ్చివాలకము తెలుస్తుంది కదండీ!" అన్నది.

"ఈమెకు పిచ్చా? మరి బాగానే మాట్లాడిందే! ఎవరో శేఖర్ అనే అతన్ని కలుసుకోటానికి ఇంటినించి పారిపోయి వచ్చానని చెప్పిందే మరి! పిచ్చిలాగా అనిపించలేదు నాకు!" అన్నాను ఆశ్చర్యంగా

ఇంతసేపూ లలితాదేవి వెక్కివెక్కి ఏడుస్తూనే ఉన్నది. అప్పుడప్పుడు తలఎత్తి నన్నూ పాపను చూస్తూ మళ్లీ తల వంచుకుంటూన్నది. మా ఆవిడ దీక్షగా అమెను గమనిస్తోంది.

అతను నవ్వాడు.

"అంత ప్రమాదకరమయిన పిచ్చేం కాదులెండి. ఆమె చెప్పింది కూడా నిజమే అనుకోండి. ఆశేఖర్‌ని కలుసుకోటానికే రెండేళ్లక్రితం వచ్చింది ఇక్కడికి. కాని తను కలుసుకోవాల్సిన శేఖర్ స్టేషన్ ఎదట కారు కింద పడి చచ్చి పోవటాన్ని చూడటం వల్లనే మతిచెలించింది ఈమెకు!" అన్నాడు.

ఆమె రెండుచేతులు పట్టుకుని ఇద్దరు బయటకు లాక్కు వెడుతున్నారు. అతనూ బయటికి వెడుతూ 'మీకు శ్రమ ఇచ్చినందుకు క్షమించండిసార్!" అన్నాడు.

నిశ్చేష్టున్నై వాళ్ళు పోవటాన్ని గమనిస్తున్న నాకు పాప బావురుమని ఏడవడంతో తెలివి వచ్చింది. పాప పిచ్చిగా అరుస్తున్నది. "వాళ్ల నాపండి!. ఆమె మా అక్కయ్యండీ! రెండేళ్ళక్రితం ఇంటినించి పారిపోయిన మా అక్కయ్యండీ. ఆపండీ!"